కష్టాల కడలిపై కన్నీటి జీవనం

వరుస తుపాన్లతో మత్స్యకారుల జీవితం అతలాకుతలం

రుషికొండ వద్ద తీరానికి పరిమితమైన బోట్లు, వలలు





తీరానికి పరిమితమైన బోట్లు

- నెలల తరబడి తీరానికే పరిమితమైన వలలు, బోట్లు
- అందని ప్రభుత్వ సహాయం
- వృత్తిని వదిలి కూలీలుగా మారుతున్న వైనం

కొమ్మాది: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏడు నెలల నుంచి వరుస తుపాన్లు, అల్పపీడనాలు, వాయుగుండాలతో మత్స్యకారుల బతుకులు ఒడ్డును పడ్డ చేపల్లా గిలగిలా కొట్టుకుంటున్నాయి. వేట లేక ఆర్థికంగా చతికిలపడుతున్నారు. మత్స్యకారులకు వేటే జీవనాధారం. మత్స్య వేటతోనే కుటుంబ నావను నడిపించుకుంటారు. గంగమ్మ కరుణిస్తే సిరుల పంట.. ఆగ్రహిస్తే కన్నీటి వరద అన్నట్లుగా ఉంటుంది. భీమిలి పరిధిలోని ఉప్పాడ, మంగమారిపేట, కాపుల దిబ్బడపాలెం, తిమ్మాపురం, రుషికొండ ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు ఇప్పుడు ఆ గడ్డు పరిస్థితులనే ఎదుర్కొంటున్నారు.

వరుస తుపాన్లే..

ఈ ఏడాది మత్స్యకారులకు వేట అనుకున్న విధంగా సాగలేదు. వాస్తవానికి సముద్రంలో వేట నిషేధ సమయం ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకు రెండు నెలల పాటు మత్స్యకార వృత్తికి దూరమై ఇంటికే పరిమితమయ్యారు. జూన్ 14 తరువాత కోటి ఆశలతో గంగమ్మకు దండం పెట్టుకుని వేటను ప్రారంభించారు. అయితే జూలై నుంచి డిసెంబర్ వరకు వరుసగా సంభవించిన తుపాన్లతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. రెండు రోజులు వేటకు వెళ్తే 28 రోజులు ఇంటికి పరిమితం అయిన పరిస్థితి. దీంతో ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్నారు.

ఆపదలో ఆదుకోని ప్రభుత్వం

వేట నిషేధ సమయంలో ప్రభుత్వం మత్స్యకారులకు విరామ భృతి రూ.10వేలు అందించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మత్స్యకార భరోసాకు మంగళం పాడింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ. 20వేలు విరామ భృతి ఇస్తామని మత్స్యకారులపై ప్రభుత్వం ఆశల వల విసిరింది. తీరా అధికారంలోకి వచ్చాక అసలు విరామ భృతి ఊసే మరిచిపోయింది. ఏడు నెలల నుండి వాయుగుండాలతో పోరాటం చేస్తూ, వేటవిరామంతో పస్తులు ఉంటూ అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు మత్స్యకారులు. మత్స్యకార భరోసా దేవుడెరుగు.. కనీసం తుపాను సమయంలోనైనా తాము ఎలా ఉన్నామో చూడటానికి ఒక్క ప్రజా ప్రతినిధికూడా రాలేదని ఇక్కడ మత్స్యకారులు వాపోతున్నారు. వరుస తుపాన్లతో బ్రతుకే భారమవుతోందని ఇక్కడి వారు ఆందోళన చెందుతున్నారు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉంటే మత్స్యకార బరోసాతో రూ.10వేలు చొప్పున తమ ఖాతాల్లో పడేవని, తుఫాన్ సమయాల్లో మత్స్యకారులు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకునేవారని మత్స్యకారులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపల వేట సాగక కూలి పనులకు వెళ్లాల్సి వస్తోందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని గంగపుత్రులు కోరుతున్నారు.

కూలీలుగా మారుతున్న మత్స్యకారులు

ప్రభుత్వం ఆదుకోకపోవడం, ప్రకృతి ప్రకోపించడం, వరుస తుపాన్ల కారణంగా మత్స్యకారులు వేటకు స్వస్తి చెబుతున్నారు. కుటుంబాన్ని ఏదో విధంగా నెట్టుకుని రావడానికి తమ కుల వృత్తిని వదులుకుని ఆటో డ్రైవర్లుగా, కూలీలుగా, సెక్యూరిటీ గార్డులుగా, చిరు వ్యాపారులుగా మారి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మొదటి నుంచి గంగమ్మను నమ్ముకుని, ఇప్పుడు ఆ తల్లిని వదిలి రావాలంటే ప్రాణం పోతుందని, కానీ తప్పని పరిస్థితిలో కుల వృత్తిని కోల్పోతున్నామని స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



వరుస తుపాన్లుతో వేటకు వెళ్లక పూట గడవడం కష్టంగా మారింది. కుటుంబాన్ని పోషించడం భారంగా మారింది. మా పరిస్థితి అర్థం చేసుకుని ప్రభుత్వం ఆదుకోవడానికి ముందుకు రావాలి. మత్స్యకార భరోసాతో పాటు తుపాను సమయంలో వేటకు వెళ్లక నష్టపోయిన మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి.
– మేరుగు ఎల్లాజీ, ఉప్పాడ, మత్స్యకారుడు

వృత్తిని వదిలేశాం



మొన్నటి వరకు గంగమ్మను నమ్ముకుని వేటే జీవనాధారంగా బతుకు సాగించాం. ఇటీవల వాతావరణం ప్రతికూలంగా మారడం, వరుస తుపాన్లు ఉండటంతో వేటకు మానేయాల్సి వస్తోంది. దీని వలన ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అందుకే తరతరాలుగా మా జీవనాధారమైన వేటకు స్వస్తి చెప్పి రామాద్రి వద్ద ఐస్ క్రీం బడ్డీ పెట్టుకున్నాను.
– దూడ ఎల్లాజీ, మత్స్యకారుడు, మంగమారిపేట.

వరుస తుపాన్లతో ఇబ్బందులు



అన్ సీజన్ తరువాత ఎన్నో ఆశలతో వేటకు సిద్ధమయ్యాం. అయితే వరుస తుపాన్లతో నెలల తరబడి ఇంటికే పరిమితమయ్యాం. ఓ వైపు ప్రభుత్వం ఇవ్వాల్సిన మత్స్యకార భరోసా అందక, మరో వైపు తుపాన్లతో వేట సాగక పస్తులతో బతకాల్సిన పరిస్థితి. ఇటీవల తుపాన్లకూ పరిస్థితి అంతంతమాత్రంగా ఉంది. ప్రభుత్వం మా ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని వేట విరామ భృతిని విడుదల చేయాలి.
– పుక్కళ్ల ఎల్లయ్య, మత్స్యకారుడు

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: ఉపాధ్యాయుల సర్వీసుపరమైన సమస్యలు పరిష్కరించడంలో కార్యాలయ ఉద్యోగులదే కీలక పాత్ర అని విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్ అన్నారు. ఏపీ పాఠశాల విద్య సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన క్యాలెండర్‌ను సంఘం నాయకులతో కలసి శుక్రవారం ఆర్జేడీ విజయ భాస్కర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి. ఆనంద్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు శైలజా కుమారి, కోశాధికారి కృష్ణచైతన్య, అసిస్టెంట్ డైరక్టర్ బి.వి. నరసింగరావు, ముత్యాలరావు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయ క్యాలెండర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

మధురవాడ: జాతర గట్టు చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మూడో వార్డులో ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

భీమునిపట్నం: భీమిలి మూడో వార్డు పరిధిలో శుక్రవారం సాయంత్రం మలేరియా అధికారి ఎస్.సూరిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఫాగింగ్ నిర్వహించారు. పెద్దబజారు, మెయిన్‌రోడ్డు, బ్రాహ్మణవీధి ప్రాంతాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లలో దోమలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

పర్యాటక ప్రాంతంలో కుక్కల బెడద



రుషికొండ బీచ్‌లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కుక్కల బెడద పర్యాటకులను ఆందోళనకు గురి చేస్తోంది. ఇక్కడికి నిత్యం వచ్చే వేలాది మంది పర్యాటకులను కుక్కలు పరుగులు పెట్టిస్తున్నాయి. ఎంతో దూరం నుంచి ఈ బీచ్‌కు వచ్చి కాసేపు ప్రశాంతంగా గడుపుదామంటే కుక్కలు ఆందోళనకు గురి చేస్తున్నాయని పర్యాటకులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో పబ్లిక్ టాయిలెట్లు

తగరపువలస: ఆనందపురం మండలం బోని పంచాయితీ ఎస్సీ కాలనీలో పబ్లిక్ టాయిలెట్లు శిథిలమై, నిరుపయోగంగా ఉన్నాయి. జీవీఎంసీ వాటర్స్ వర్క్స్ ప్రహరీని ఆనుకుని ఉన్న వీటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ టాయిలెట్లు వినియోగానికి పనికిరాకపోవడంతో సొంతంగా మరుగుదొడ్లు లేని ఇక్కడి కుటుంబాలు ఆరుబయటకు వెళ్లవలసి వస్తోంది. కొన్నిసార్లు వ్యవసాయభూములు ఖాళీగా లేకపోవడంతో వీరి సమస్య ఎవరికీ చెప్పుకోలేకపోతున్నారు. అధికారులు స్పందించి, మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ పర్యటన నేడు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ శనివారం భీమిలి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఆనందపురంలోని జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు ఇంటి వద్ద పత్రికా సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం 11 గంటలకు భీమిలి మండలం టి.నగరపాలెం రానున్నారు. కుమార్తె కాపురంలో కలతల కారణంగా ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బొట్ట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు.

అలరించిన గీతాలాపన



గీతాలాపన చేస్తున్న కె.నాగజ్యోతి బృందం

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్‌లోని మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో రాగా మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గీతాలాపన భక్తులను అలరించింది. కె.నాగజ్యోతి సారథ్యంలో మహాలక్ష్మి అమ్మవారి జీవిత చరిత్రపై పాడిన పాటలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి.

లారీ డ్రైవర్ అదృశ్యం



తాడి వెంకటరావు (ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం చందక పంచాయతీ యడ్లవారి కళ్లాలకు చెందిన తాడి వెంకటరావు(40) అనే లారీ డ్రైవర్ శుక్రవారం ఉదయం 4.30 గంటల సమయంలో ఇంటి నుంచి అదృశ్యమైనట్లు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలివి.. మద్యానికి బానిస అయిన వెంకటరావు మానసిక స్థితి మూడు నెలలుగా బాగాలేదు. తనను ఎవరో హత్య చేస్తున్నట్టు మూడురోజులుగా తనలో తాను మాట్లాడుకుంటూ ప్రవర్తిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిద్ర లేచిన వెంకటరావు వాష్‌రూమ్‌కు వెళ్లతానని భార్య కుమారితో చెప్పి బయటకు వచ్చారు. తరువాత తిరిగి ఇంట్లోకి రాకపోవడంతో భార్య చుట్టుపక్కల బంధువుల ఇళ్లల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ సీహెచ్ వాసునాయుడు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ గాంధీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు

- వీఐపీ దర్శనాలు వేకువజామున 4 గంటల నుంచి 6 గంటల వరకు మాత్రమే
- రాత్రి 10 గంటల వరకు సర్వ దర్శనాలు



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి (టీటీడీ) ఆలయంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. ఆ రోజు వేకువజామున 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు సర్వదర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు. తెల్లవారుజామున 4గంటల నుంచి 6 గంటల వరకు మాత్రమే వీవీఐపీ, వీఐపీ, డోనర్స్ దర్శనాలు ఉంటాయన్నారు. అదే విధంగా సాయంత్రం 7 గంటల నుండి 7.30 గంటల వరకు బ్రేక్ ఉంటుందని, 7.30 నుండి రాత్రి 10 గంటల వరకు సర్వదర్శనాలు కొనసాగుతాయని తెలిపారు. ఆ రోజు సుమారు 50 వేల నుంచి 60వేల వరకు భక్తులు శ్రీవారిని దర్శించుకోనున్నారని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, పార్కింగ్, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాలకు కొండపైకి అనుమతి లేదని, కొండ దిగువ భాగాన పార్క్ చేసుకోవాలని, కార్లు మాత్రమే పైకి అనుమతిస్తామని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం మరో రెండు బస్సులను అదనంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం



బొత్సపేటలో నిర్మాణం మధ్యలో నిలిచిన అంగన్‌వాడీ భవనం



ప్రస్తుతం నిర్వహిస్తున్న శిథిల భవనం

పద్మనాభం: మండలంలోని బి.ఆర్.తాళ్లవలస పంచాయతీ అంగన్‌వాడీ భవనాన్ని అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. దీంతో శిథిలావస్థలో ఉన్న అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించాల్సి వస్తోంది. సుమారు ఏడేళ్ల క్రితం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటికీ ఈ భవనం పనులు పూర్తి కాలేదు. శ్లాబ్ వరకు నిర్మించి వదిలేశారు. కిటికీలు, ద్వార బంధాలకు తలుపులకు అమర్చలేదు. గచ్చులు చేయలేదు. రంగులు వేయలేదు. నిధులు చాలకపోవడంతో ఈ పనులు చేపట్టకుండా వదిలేశారు. దీనిపై బి.తాళ్లవలస ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు మండల సర్వసభ్య సమావేశంలోనూ ప్రస్తావించారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశం జరిగి సుమారు రెండు నెలలు కావస్తున్నా భవనం స్వరూపంలో మార్పులేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అంగన్‌వాడీ భవనం నిర్మాణాన్ని పూర్తి చేసి, దానిలో కేంద్రం నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శం

జయంతి వేళ తొలి ఉపాధ్యాయినికి ఘన నివాళులు

తగరపువలస: సావిత్రిబాయి పూలే జీవితం మహిళలకు ఆదర్శమని జీవీఎంసీ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. సావిత్రిబాయి జయంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఆమె గురించి విద్యార్థులకు వివరించారు. భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలైన ఆమె 1848లో బహుజనులకు పాఠశాల ప్రారంభించారని, 18 ఏళ్లలో 52 పాఠశాలలు ప్రారంభించారని తెలియజేశారు.

- ఏపీఎంటీఎఫ్ తరఫున నిర్వహించిన మహిళా ఉపాధ్యాయ దినోత్సవంలో భీమిలి ఎంపీవోలు జయప్రద, శివరాణిలను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ అమరనాథ్, భీమిలి అధ్యక్షుడు దుర్గాప్రసాద్, వై.ప్రతాప్‌సింగ్, లీలామణి, వెంకటేష్, సీహెచ్ అశోక్ పాల్గొన్నారు. విల్సన్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినులు జె.ఈశ్వరమ్మ, ఎల్.భవానీలను సత్కరించారు.
- చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సావిత్రిబాయి గురించి ప్రిన్సిపాల్ శ్రీవాణి విద్యార్థులకు వివరించారు.
- తాటితూరు ప్రాథమిక పాఠశాల, శింగనబంధ పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె.సన్యాసినాయుడు, గొట్టిపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు సావిత్రిబాయికి నివాళులు అర్పించారు.

పద్మనాభం: సావిత్రి బాయి పూలే జయంతిని పద్మనాభం జంక్షన్‌లో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సావిత్రి బాయి చిత్ర పటానికి బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. పద్మనాభం మండల శాఖ బీజేపీ అధ్యక్షురాలు తమటపు నాగమణి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు పాల్గొన్నారు.



సావిత్రి బాయి పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఈడీ డా. రాణి మందా



మధురవాడలో సావిత్రిబాయి చిత్రపటం వద్ద ఐద్వా నాయకుల నివాళి

సావిత్రి బాయి ఆశయ సాధనకు కృషి

మధురవాడ: మహిళల విద్య, హక్కుల కోసం విశేషమైన కృషి చేసిన మొట్టమొదటి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే అని ఐద్వా నాయకులు అన్నారు. కొమ్మాది సమీపంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మధురవాడ జోన్ ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు కె.సుజాత, బి.భారతి, కె.పుష్ప, ఎల్.పద్మ, ఉమ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత సంఘ సేవకురాలు

కొమ్మాది: సమాజంలో మూఢ నమ్మకాలను ఎదిరించి, స్త్రీ విద్య కోసం జీవిత కాలం పనిచేసిన మహోన్నత సంఘ సేవకురాలు సావిత్రి భాయి పూలే అని టీసీఆర్‌టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.రాణి మందా అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ మిషన్ (టీసీఆర్‌టీఎం) ప్రాంగణంలో పూలే చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీసీఆర్‌టీఎం సిబ్బంది పాల్గొన్నారు.




మహిళా అధ్యాపకులకు సత్కారం



పద్మనాభంలో సావిత్రి బాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మహిళా అధ్యాపకులకు సత్కారం

భీమునిపట్నం: మహిళా ఉపాధ్యాయుల సేవలు సమాజానికి ఎంతో అవసరమని భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి కుమారి అన్నారు. కళాశాలలో శుక్రవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవం, సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. డైట్‌లో మహిళ అధ్యాపకులను సత్కరించారు. అధ్యాపకులు సుధాకర్, నాగేశ్వరరావు, సోమయాజులు, త్రినాథ్ పాల్గొన్నారు.



విల్సన్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో మహిళా ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న ఏపీఎంటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అమరనాథ్



బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ..



చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో..

అధ్వానంగా నమ్మివానిపేట మార్గం

- మురుగు ప్రవాహానికి డెబ్రిస్‌తో అడ్డుకట్ట
- రోడ్డుపైనే మురుగు



ఎన్ఆర్ఐ హాస్టల్ వద్ద నమ్మివానిపేట రోడ్డుపైకి మురుగు నీరు



లంగర్‌ఖానా భూముల వద్ద రహదారిపై గోతులలో నిలిచిన మురుగు నీరు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు నమ్మివానిపేట–ఆదర్శనగర్ రహదారి అధ్వానంగా ఉంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ముక్కు మూసుకోకుండా ఉండలేని పరిస్థితి. కర్రి నమ్మివానిపేట వద్ద పాక్షికంగా నిర్మించిన డ్రైనేజీ నుంచి మురుగు ఆదర్శనగర్ వైపు పారుతోంది. దీనికి ఎన్ఆర్ఐ ఆస్పత్రి హాస్టల్ వద్ద యాజమాన్యం డెబ్రిస్‌తో అడ్డుకట్ట వేసిన సంగతి తెలిసిందే. దీనిని జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, శానిటేషన్ సిబ్బంది రెండు నెలలుగా పరిష్కరించలేకపోతున్నారు. దీంతో రహదారి మురుగుమయంగా మారిపోయింది. అదే మార్గంలో లంగర్‌ఖానా భూములు, ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద రహదారి మొత్త చిద్రం కావడంతో మురుగు మొత్తం రోడ్డుమీదే నిలిచిపోతుంది. దీంతో ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇక నమ్మివానిపేట–ఆదర్శనగర్ రహదారికి ఇరువైపులా పూర్తిగా డ్రైనేజీలు లేకపోవడంతో ఒకవైపు ఆస్పత్రి నుంచి మెడికల్ వ్యర్థాలు, మరొక వైపు డ్రైనేజీ వ్యర్థాలు ముంచెత్తాయి. దీంతో ఈ మార్గంలో 300 మీటర్ల మేర రహదారి దుర్గంధభరితంగా మారిపోయింది. జీవీఎంసీ సంబంధిత విభాగాలు జోక్యం చేసుకుని ఈ మార్గంలో రాకపోకలకు అనువుగా డ్రైనేజీలను తీర్చిదిద్దాలని, మురుగు, వ్యర్థాలు ఆదర్శనగర్ వార్డు సచివాలయం ఎదురుగా ఎర్ర చెరువులోకి మళ్లించాలని కోరుతున్నారు.

భర్త ఇంటి ముందు ఆందోళన



శ్రీనివాసరావు ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న భూలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు

భీమునిపట్నం: తనను ఇంటికి తీసుకు వెళ్లాలని కోరుతూ ఒక మహిళ, ఆమె కుటుంబసభ్యులతో కలసి భర్త ఇంటి ముందు శుక్రవారం ఆందోళన చేశారు. వివరాలివి.. ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీ యాతపేట గ్రామానికి చెందిన పుత్తల రమణమ్మకు భీమిలికి చెందిన ఎర్ర శ్రీనివాసరావుతో ఐదు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అయితే, మనస్పర్థలు రావడంతో వారు మూడేళ్లుగా విడిగా ఉంటున్నారు. కాగా, తన భర్త బంగారం, కట్నం తీసుకుని తనను పట్టించుకోకుండా వదిలేశారని ఆరోపిస్తూ రమణమ్మ ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. ప్రస్తుతం ఆ కేసు కోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో తనను భర్త ఇంటికి తీసుకువెళ్లాలని కోరుతూ రమణమ్మ తన కుటుంబసభ్యులతో కలసి, భీమిలి సమీపంలోని నేరెళ్లవలస కాలనీ వద్ద ఉన్న శ్రీనివాసరావు ఇంటి వద్ద ఆందోళన చేశారు. దీనిపై స్పందించిన భీమిలి పోలీసులు వారిని స్టేషన్‌కు తీసుకువెళ్లారు. సీఐ సుధాకర్ మాట్లాడుతూ కేసు కోర్టులో నడుస్తున్నందున, అది తేలేంతవరకు ఎటువంటి ఆందోళనలు చేయకూడదని వారికి చెప్పి పంపించేశారు.